


కొందర్ని జీవితంలో దూరమైనా —
ఎనాడైనా ఎక్కడైనా కలియాలని ఉంటుంది. కొందర్ని చూచే ప్రసక్తి ఉండదు. నిజానికి రాజు, రాధని కలియాలని ప్రత్యేకంగా ఏనాడూ కోరుకోలేదు. కాని ఆమె తటస్థపడి, అతని గురించి చెపుతూంటే విని గర్వపడాలన్న కనీసపు కోరిక లేకపోలేదు అతనికి.

అనుకోకండా రాధను కలిశాడు రాజు.

కాని..................

* * *

"......నేను స్టేషన్‌కి రాలేనంత మాత్రాన నీవు ఇంటికి రాకుండా వెళ్ళిపో వద్దు. ఆఫీసులో ఏమాత్రం వీలు చిక్కినా స్టేషన్‌కి రా ప్రయత్నిస్తాను. నేను రాని పక్షంలో నీవు మాత్రం ఇంటికి రాకుండా



ఎక్కడో పనిచేయవద్దు. ఎడ్రస్ యిస్తున్నాను; చూచుకొని తిన్నగా ఇంటికి వచ్చేయి-" ట్రైను దిగి స్టేషన్ అంతా కలయచూస్తున్న రాజు కళ్ళముందు మూర్తి ఉత్తరంలో వ్రాసిన వాక్యాలు మెల్లగా కదిలాయి.

మూర్తికోసం ప్లాట్‌ఫారం అంతా గాలించి, స్టేషన్ దాటి, రిక్షాస్టాండును సమీపించాడు రాజు.

కాలవశాన్న విడిపోయి, ఒకరి కొకరు దూరప్రదేశాలలో దూరంగా ఉన్న రాజూ, మూర్తీ ఒకే ఊరివారు. ఒకే బడిలో చదువుకున్నారు. డబ్బున్న మూర్తి కాలేజీ చదువు సాగించుకోగలిగాడు. అది లేనివాడై బడిగడప లన్నీ దాటి, ఇంకేమీ దాటకూడ దనుకొని, తల్లీతండ్రీ అతనిని విడిచిపోతే, పొట్ట గడవటంకోసం, ఊరు విడిచిపోయాడు రాజు. ఆనాడు మూర్తి పట్నంలో ఉన్నాడు. కూటికోసం చాలా ఉద్యోగాలు చేశాడు రాజు. చాలా ప్రదేశాలు తిరిగాడు. చాల అనుభవాలను అతని చిన్న పాత్రటంకులో నింపుకున్నాడు. తిండిలేక అలమటించాడు- చాల సార్లు, చాలచోట్ల, చాలరోజులు. అర్థికంగా బక్కచిక్కిన అతనికి మూర్తినుండి తప్ప ఏ ఒక్కరినుండీ సానుభూతి లభించలేదు. మూర్తిని రాజు గౌరవించాడు. మూర్తి రాజును అభిమానించాడు. ఎంత దూరంలో ఉన్నాసరే తన క్షేమసమాచారం మూర్తికి అందజేశాడు రాజు. మూర్తి ఉత్తరాలు వ్రాయటమే కాక రాజుకు డబ్బు అవసర మున్నరోజుల్లో తన శక్తి కొలదీ సహాయం చేశాడుకూడా. తన పెండ్లికి మరీమరీ రమ్మని ఆహ్వానించాడు మూర్తి రాజును; కాని రాజు ఖాళీపర్సు అతన్ని రైలు ఎక్కనీలేదు. మిత్రుని చూడాలని అయిదు సంవత్సరాలనుండీ ఆయత్తమౌతూ, విరమించుకున్నాడు రాజు. ఆ అయిదు సంవత్సరాలలో రాజు పరిస్థితి కొంత మెరుగైంది. ఒక గూడు కుదిరింది. ఆ వెంటనే జోడు కలిసింది. పిల్లా, పాపా లేకపోయినా, సుఖశాంతులు ఒట్టిపోకుండ, సంసారయాత్ర చేసికుంటూ వచ్చాడు రాజు. మిత్రుని చూడాలన్న చిరకాలవాంఛతో బయలుదేరాడు రాజు.

మూర్తి యిచ్చిన చిరునామా చూచుకుంటూ, దారిలో కలిసినవారిని భోగట్టా చేస్తూ, మూర్తి మేడముందు రిక్షా లో చేరాడు రాజు. మూర్తి ఇల్లు అదే అని చూపించి ఒకాయన సెలవు తీసికున్నాడు. మేడముందు గేటుకు తగిల్చి ఉన్న మూర్తి 'నేమ్ బోర్డు' చూచి, మేడముందు చక్కని పద్ధతులలో పెంచబడి రంగురంగు పూలతో, వివిధ పరిమళాలను వెదజల్లే పూవులు కలిగిన మొక్కలను, రాచఠీవి ఒలికిస్తూ గంభీరంగా నవీనపద్ధతులలో కట్టబడి నిలబడ్డ సిమ్మెంటురంగు మేడను చూచి నెమ్మదిగా గేటు తీసికొని లోపలికి వెళ్ళాడు రాజు.

తలుపులు దగ్గరగా వేసివున్నాయి. కొద్దిసేపు సంశయించి ద్వారానికి అమర్చబడివున్న కాలింగ్ బెల్ నొక్కాడు. కొద్దిసేపు వేచివున్నాడు. గలగలలాడే గాజులశబ్దం తలుపును సమీపించింది. ఎయర్ బ్యాగు భుజానికి తగుల్చుకు దూరముగా జరిగి నిల్చున్నాడు రాజు.

"ఎవరూ?" అంటూ తలుపు తీస్తూ ప్రశ్నించిం దొక తీయనిగొంతు.



రాజు సమాధానం చెప్పేలోపుగా ఆ తీయనికంఠం అందమైన రూపుతో కూడి అతని ఎదుట నిలిచింది.

ఆమెను చూడగనే ఒక్కసారి చలించి వెనకకు అడుగువేశాడు రాజు. ఒక్క చూపులో కలిగిన అనుభూతి కాలం పరచిన మైలురాళ్ళలో యోజనాల దూరం పరుగెత్తి వెనుకకు పోయింది.

ముక్కులో అందమైన విరుపులు, కళ్ళలో కాంతులు, పెదవులలో సౌకుమార్యం అతనికి రాధను గుర్తుకు తెచ్చాయి.

తలుపు తెరచి వచ్చినదెవరో తెలిసికోవాలనుకున్న ఆమె రాజును చూచి, విద్యుద్ఘాతం పొందిన దానిలా వెనక్కి అడుగిడి నిలిచిపోయింది. కనుబొమ్మలు ముడిపడ్డాయి. పెదవులు కంపించాయి. అతని వైపు చూడలేక ముఖం క్రిందికి దించుకుంది, 'యాటమ్'లాంటి క్షణాలలోనే నల్లబడిన ఆమె మోముపై అమావాస్య రాత్రి వెలసిన చుక్కలులా స్వేదబిందువులు వెలిశాయి. కొద్ది క్షణాలక్రితమే నుదిటిపై స్వేచ్ఛగా లాస్యం చేసే ఆమె ముంగురులు, స్వేదబిందువులచేత ఆమె నుదుటను అతుక్కొని ఉండిపోయాయి. ఆమె చేతివ్రేళ్ళు కంపించాయి. కంటిచూపులు అనిశ్చితాలైపోయాయి. అయస్కాంతానికి అతుక్కున్న ఇనుపముక్కమాదిరి తలుపుదగ్గర నిలుచుండిపోయిందామె.

ఆ పరిస్థితి ఆమెకు దుర్భరం అని

తెలిసికోటానికి అతనికి ఎక్కువకాలం పట్ట లేదు. ఆ పరిస్థితిలో ఆమెను శ్రమపెట్టడం ఏమాత్రం యిష్టం లేకపోయింది రాజుకు.

"**మూర్తిగారిల్లు యిదేనాండీ?**" ఆమెను చూడగానే అతనిలో ఉదయించిన ప్రశ్నను బహిర్గతం చేశాడు రాజు.

"**అవును,**" అందామె. ఆ మాటలు నూతిలోనుండి వచ్చినట్లు వచ్చాయి.

ఆమె సమాధానం రాజులో వేయి బాంబుల పేల్చింది. మూర్తి యిల్లు అదే అయితే ఆమె అక్కడుండే అగత్యమేమిటి? ఇంతకీ ఆమెకూ మూర్తికీ సంబంధమేమిటి? తన్ను చూచి ఆమె భయపడటానికి కారణ మేమిటి? అనే ప్రశ్నలు అతన్ని బాధి స్తూండగా వణికే గొంతుకతో:

"అయితే ... మీరు.... మీరు ...." అని ఆగిపోయాడు.

"అవును...నేను... నేను... ఆయన... ఆయన..." అంటూ ఆగిపోయింది.

"ఆయితే మీరూ మూర్తీ భార్యా భర్తలా?" అన్నడు అకస్మాత్తుగా.

"అవును," అందామె నీరసంగా. రాజు మౌనం వహించాడు.

కొద్దిసేపు మౌనంగా ఉండిపోయిం దామె.

నిశ్శబ్దాన్ని చీల్చుతూ "మూర్తిని చూదామని వచ్చాను. కాని వాడిని చూచే అవకాశం ఉన్నట్టులేదు. నేనూ ఉంటానికి వ్యవధిలేదు. నే వెళుతున్నాను. రాజు వచ్చివెళ్ళే డని చెప్పండి," అంటూ వెనకకు తిరిగాడు.

"ఏమండీ!" కీచుగా పిలిచిం దామె.

వెనుకకు తిరిగిచూచాడు రాజు.

ఏదో చెప్పాలని ఆమె పెదవులు కదిలాయి. కాని అతన్ని చూచి మాట్లాడ లేకపోయింది.

రాజే అన్నాడు:


"మీ రిక్కడున్నారని నాకు తెలియదు. తెలిస్తే వచ్చేవాడినే కాదు. వెళ్తాను," అని.

ఆమె నిస్సహాయంగా 'అది కా'దన్నట్టు తలూపింది. తల విదుల్చుకుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

వాటిని చూడలేక వెనుదిరిగాడు రాజు. మెట్లు దిగి నాలుగడుగులు వేసి గేటుదాటాడు. ఇంతలోనే ఇంటిముందొక కారాగటం అందులోంచి మూర్తీ, మూడేండ్ల పిల్లవానిని తీసికొని ఒక నౌకరూ దిగడం చూచాడు రాజు. రాజును మూర్తి చూచాడు. కారు దిగుతూనే "ఆరే రాజూ!" అంటూ వీధిలోనే కౌగలించుకునేంతపని చేశాడు మూర్తి.

"ఇంటి తలుపుమీద నా పేరున్న 'నేమ్ బోర్డు' చూడకుండా వెళ్ళిపోతు న్నావ్. ఇంకా నయం – నే రాకపోతే ఇలాగే వెళ్ళిపోయేవాడివన్న మాట. పద పద, అదే మా యిల్లు. నీ కలా నేను ఉత్తరం వ్రాసినా ఉన్నంతలో నే ట్రైము చిక్కించుకోని స్టేషన్ కెళ్ళాను. నే వెళ్ళే సరికి ట్రైను వెళ్ళిపోయింది. ఒకవేళ నే రాలేకపోతానేమో నని నీ గురించి మా ఆవిడకు చెప్పాను." గేటు దాటి, ఇంటి అరుగు ఎక్కేంతలో గబగబా చెప్పాల్సి నవి నాలుగూ చెప్పేశాడు.

రాజు బ్యాగు గదిలో పెట్టించి మేడ మీదికి తీసికెళ్ళాడు మూర్తి రాజుని. మేడమీద తన గదిలో రాజును కూర్చో బెట్టి "ఏరా! రాజూ! ఈ ఇల్లు, అంటే, ఐ మీన్, ఈ మేడ, ఈ కారు, ఈ అట్ట




హాసం చూచి నీ మిత్రుడు నీకు సరగా మర్యాదలు చేస్తాడో లేదో అని సంశయ పడుతున్నావా? లేదు రాజూ! ఈవన్నీ శాశ్వతాలు కావు. నీలాటి మిత్రుడి అభిమానం శాశ్వతం. దేవుడు చాల దయామయుడు. నాకు, నా మనసెరిగి వర్తించ గల సద్గుణవతియైన భార్యను ప్రసాదించాడు. నీలాటి మిత్రుని యిచ్చాడు. ఈ జన్మకివి చాలు,'' అన్నాడు మూర్తి.

రాజు గుండెలో గడ్డకట్టిన మంచు నీరయింది. కళ్ళు చమ్మగిల్లినట్టయ్యాయి. ఎందుకో ఏడ్వాలనిపించింది రాజుకు.

కాఫీ, టిఫిన్ రావడంతో ప్రసంగం మారింది.

కాఫీ త్రాగుతూ చిన్ననాటి ముచ్చట్లన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటూ, 'ఆనాడిలా చేశాము కదా! ఫలానివానిని అలా ఏడిపించాము కదా! వాడినలా తన్నాము కదా! ఆ రోజు వాడిలా అన్నాడు కదా! ఆ రోజు ఇలా గడిచింది కదా!'' అంటూ తనకు జ్ఞాపకమున్నవన్నీ చెప్పుకుపోతున్నాడు మూర్తి.

రాజుకు అవన్నీ గుర్తే. అదే యింకో రోజు అయితే మూర్తికన్నా చాలా ఎక్కువ ఉత్సాహంతో ప్రసంగం చేయగలిగేవాడు; కాని ఆనాడిది సాధ్యపడలేదు. రాజు చెవులకు మూర్తి మాటలేమీ ఎక్కటం లేదు. అతనిలో కదిలేది మూర్తి అమాయకపు ముఖం; అతనిలో కదిలేది మూర్తికి జరిగిన అన్యాయం. ఏనాడూ ఊహించనిది నిజమై ఘనీభవించినందుకు బాధ పడుతూ మూర్తిని చూస్తూ ఉండిపోయాడు రాజు.

''స్నానం చేసి బట్టలు మార్చుకో. భోజనం కానిద్దాం,'' అంటూ లేచాడు మూర్తి. పనికుర్రవాడివెంట బాత్‌రూమ్ వైపు వెళ్ళాడు రాజు.

రాజు స్నానం చేసి వచ్చేసరికి మూర్తి

చంకలో ఒక కుఱ్ఱవానిని ఎత్తుకొని ఎదురుపడి "ఇదిగోరా! మా చిరంజీవి," అంటూ రాజుకు అందించాడు ఆ పిల్లవానిని.

"అబ్బాయా! అమ్మాయి అని నాకు గుర్తు" అన్నాడు రాజు పిల్లవానిని అందుకుంటూ.

"భలేవాడివే! నేను అమ్మాయి పుట్టిందని ఎప్పుడు వ్రాశాను? అబ్బాయి పుట్టాడనే వ్రాశాను. గుర్తు లేదేమిటి?"

నిజానికి మూర్తి అలాగే వ్రాశాడు.

రాజు కాదనుకున్నది నిజమైపోయింది.

"ఏమిటలా ఆలోచిస్తున్నావ్?"

"అబ్బే, ఏంలేదు; నేనే పొరపడ్డాను." అన్నాడు రాజు.

ఇంతలో భోజనానికి పిలుపు వచ్చింది.

"రా! భోజనం చేద్దాం," అంటూ వంటింటివైపు తీసికెళ్ళాడు మూర్తి రాజును. రాజు రావటం చూచి వంటింట్లో ఒకమూల నిలబడిపోయింది. రాజు గడపలోనే నిలబడిపోయాడు.

"రారా! రాజూ! అక్కడే నిలబడిపోయావేం? ఓహో, మీ యిద్దర్నీ పరిచయం చేయలేదని కాబోలు. రాధా! నాచిన్ననాటి స్నేహితుడు, రాజు, అని చెబుతూంటానే—వాడే వీడు. ఒరేయ్! నీకు వేరే చెప్పనవసరంలేదు. ఇది నాభార్య రాధ" అని ఒకరి నొకరికి పరిచయం చేశాడు మూర్తి.

"నమస్తే" అన్నాడు రాజు నీలినీడలు కదలాడే ఆమెమోమును నొకింత పరికిస్తూ.


"నమస్తే" అందామె హీనస్వరంతో. ఆమె పెదవులపై నవ్వు మెరవలేక పోయింది.

"కూర్చోరా! అన్నాడు మూర్తి.

రాజు భోజనంముందు మూర్తితో కూర్చున్నాడు. వంటలక్క భోజనం వడ్డిస్తూంటే రాధ వెనుకనుండి అజామాయిషీ చేయసాగింది. మౌనంగా భోజనం ముగించాడు రాజు.

రాజుకై ఏర్పరచిన ప్రత్యేకమైన గదిలోకి తీసికెడుతూ. "కాస్త నేవు విశ్రాంతితీసుకో. సాయంత్రం నాలుగు గంటలైనతరువాత బజారు కెడదాం. ఈరోజు ఆఫీసు కెళ్ళను," అన్నాడు. విశ్రాంతికై రాజు పందిరిమంచంపై నడుము వాల్చాడు. మూర్తి తనగదిలోకి వెళ్ళిపోయాడు.

చాలాసేపటికిగానీ రాజును నిద్రాదేవి వరించలేదు. రాజుకు మిగిలింది ఏకాంతం ఆ ఏకాంతంలోనే జ్ఞాపకాలు పరుగెత్తటం పరిపాటికాబోలు. నిద్రరాని రాజుకు జ్ఞాపకాలను పొందుపరచుకోవటం తప్ప వేరే ఏదీ లేకపోయింది. కాని ఆ జ్ఞాపకాలన్నీ రాధనే గుర్తుచేయడం రాజుకు బాధాకరమైంది. రాధగురించి ఆలోచించకూడదనుకొని తల విదుల్చుకుని గదిగోడలవైపు దృష్టి సారించాడు. గదిగోడలపై సొష్టవంగా అమర్చబడిన గాజు అద్దాల బీరువాలలో అత్యంత రమణీయంగా అమరిన భువనేశ్వర దేవాలయపు, కోణార్క దేవాలయపు శిల్పాలను గుర్తుచేయు 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్' బొమ్మలుకూడ రాధను రాజుకు గుర్తు చేయక ఆగినవికావు. నలుప్రక్కల బీరువాలలో నున్న ప్రతిమలను చూచే రాజుకు 'పిల్లవాని నెత్తుకున్న స్త్రీ మూర్తి' శిల్పబడిన రాధ గురించిన ఆలోచనల



త్రవ్వి పైకితీసింది. అతనిలో రాధ మెదిలింది మరీ మరీ. కిటికీల కమర్చబడిన రంగు రంగు నైలాను తెరలుగాని, నవీన పద్ధతిలో అమర్చబడిన పందిరపు మంచాల అందచందాలుగాని. ఇంటినిండా కనిపించే ఖరీదైన సామాగ్రిగాని, పెరటినున్న పూవులతోటగాని రాజును రాధ గూర్చి ఆలోచనల చేయనీయకుండుటలో విఫలము లైనవి.

రాధను రాజు మొట్టమొదటిసారిగా చాలకాలం క్రితం చూచాడు.

ఆరోజు................

ఆ పల్లెటూరిలో రాజు పోస్టల్ రన్నరుగా పనిచేస్తున్న రోజుల్లో ఒకనాడు; రాత్రి తొమ్మిదిగంటలవేళ. శ్రావణమాసపు మేఘాలనుండి సన్నని వాన జారిపడుతున్నవేళ, చలిచలిగా గాలి వీస్తున్నవేళ, అలసటగా ఉంటే, వండుకున్న అన్నం కుంపటిమీదనుండి దింపి. వంటింటిలో బుడ్డీదీపం తగ్గించి ఉంచి, వీధిద్వారానికి చిన్న హరికన్ లాంతరు తగిల్చి, వాలు కుర్చీలో వాలాడు రాజు విశ్రాంతికోసం.

వాన జిడజిడ పడుతోంది. తీరిక చేసికొని మెరుపులు మెరుస్తున్నాయి. వీధి గుమ్మానికి తగిల్చిన హరికన్ లాంతరు మ్రాగన్నుపెట్టి నిద్రపోతోంది. అలాగే కుర్చీలో కునుకుతున్నాడు రాజు. ఇంటి ముందుండే నాలుగైదుపాకలు నిద్రకుపక్రమించాయి ముసుగుపెట్టి. వీధిలో నిశ్శబ్దత జోలపాట పాడుకుంటోంది. అప్పుడప్పుడు చలిగాలి బద్ధకంగా ఆవలిస్తోంది.

అప్పుడు యింటిముం దేదో అలికిడి అయినట్టయి కళ్ళుతెరచి చూచాడు రాజు. ఇంటిముందొక బండి ఆగి కనుపించింది. ఎవరూలేని తనకు వచ్చే బంధువు లెవరాని ఆశ్చర్యపోతూ లేచి నిలుచున్నాడు రాజు.

బండినుండి ఒక నలభై అయిదేళ్ళ స్త్రీ దిగి, వరండాలో నిలుచున్న రాజును చూచి, కొద్దిసేపు సంశయిస్తూ నిలబడి, తరువాత తలమీది ముసుగు లాక్కుంటూ అతని యింటి మెట్లెక్కి "బాబూ! ఈ సమీపంలో డాక్టర్లు ఎవరైనా ఉన్నారా?" అని అడిగింది, ఆవేదన తొణికిసలాడే గొంతుతో.

రాజు ఆలోచనలో పడ్డాడు. తరువాత అన్నాడు!

"నాటు వైద్యులు తప్ప, ప్రత్యేకంగా డాక్టర్లు ఎవరూ లేరమ్మా. ఏవమ్మా, డాక్టరు కావాలా? ఎవరికి?" అని సహాయం చేసే ఉద్దేశ్యంతో.

"ముఖంమీద పడ్డ వర్షపుచినుకులు తుడుచుకుంటూ. "అమ్మాయిని పుట్టింటికి తీసికెడుతున్నాను బాబూ! తొమ్మిదో నెల వచ్చేసినా అమ్మాయిని పుట్టింటికి పంపించాడు కాదు అల్లుడు. ఇంటినుండి బయలుదేరేముందే నలతగా ఉంది అమ్మాయి. దారిలోనే నొప్పు లందుకున్నాయి. రోడ్డుమీద బండి కట్టించి, ఈ పల్లెటూరిలో ఏదైనా ఆశ్రయం దొరుకుతుందేమో నని వెచ్చాను బాబూ! ఊరి చివర నున్న ఈ యింటిలో ఏదైనా ఆశ్రయము దొరక్కపోదని బండి ఆపించాను. అమ్మాయికి నొప్పులు ఎక్కువగా ఉన్నాయి. బండిలో ఉండటం కష్టంగా ఉంది. ఎవరైనా పిల్లలతల్లిని చూపిస్తావా? ఈ జన్మలో నీమేలు మరిచిపోను బాబూ!" అందామె బ్రతిమాలే ధోరణిలో.

రాజు తనకు తారసిల్లబోయే వింత అనుభవానికి ఒకింత ఆశ్చర్యపోతూ—


"ఆశ్రయం యివ్వడానికి నా కేమీ అభ్యంతరం లేదమ్మా! కాని ఈ యింట్లో ఆడవా రెవరూ లేరు. మీ అవుసరాలేమిటో నాకు తెలియవు. కావలసిన వేవో చెప్పండి. చేతనైనవి చేసిపెడతాను. అమ్మాయిని లోపలికి తెద్దాం, రండి. మంత్రసానికి కబురు పెడతాను తరువాత," అన్నాడు మెట్లు దిగుతూ.

"మా బంగారు తండ్రే! వెయ్యేళ్లు వర్ధిల్లాలి నాయనా!" అంటూ బండి వైపు నడిచిం దామె.

ఆమె బండినుండి దించిన యువతిని ఆమెతోపాటు సాయం పట్టి యింటిలోకి తీసుకొచ్చాడు రాజు. గబగబా ఉన్న రెండు గదులలో వెనుక గదిని పురిటిగది చేసి, ఆ అమ్మాయి పడుకోడానికి ఏర్పాటు చేశాడు రాజు. వెనుకగదిలో నున్న సామాను ముందుగదిలోకి చేర్చి, ముందుగదిలో నున్న హారికన్ లాంతరు పురిటిగదిలోకి చేర్చి, బుడ్డీదీపం ముందు గదిలో నుంచి, ప్రక్కింటి బావినుండి నాలుగు బాల్చీల నీళ్ళు నీళ్ళకుండిలో పోసి ఉంచాడు రాజు. ఈ లోపుగా ప్రక్కింటి కుఱ్ఱాడిని పంపించి మంత్రసానిని పిలిపించాడు. ఆమె రాగానే కావలసిన వేవో కనుక్కొని తెప్పించి యిచ్చాడు. పురిటిగదిలో ఆ అమ్మాయి నొప్పులు పడుతూంటే తల తుడుచుకుంటూ వీధివసారాలో నిలబడ్డాడు రాజు.

ఆ అమ్మాయి నొప్పులు పడుతూంటే కాలు నలిగిన పిల్లిలా వసారాలో పచార్లు చేస్తూ ఉండిపోయాడు.

ఇంతలో మంత్రసాని ఎందుకో వసారా




లోకి వస్తే "ఎలా ఉంది?" అని కంగారుగా అడిగాడు.

"మొదటి కాన్పు కష్టం మరి" అంటూ తనకు కావలసింది తీసికొని వెళ్ళిపోయిందామె.

ఉండబట్టలేక చిరిగిపోయిన గొడుగు తీసుకొని నాలుగు ఇళ్ళ అవతల ఉన్న ఎలిమెంటరీ స్కూలు మేష్టారింటి కెళ్ళి, తలుపు తట్టి, ఆయన భార్య శాయమ్మకు విషయమంతా బోధపరిచి, తన యింటికి తీసికొచ్చాడు. లోపలి కామెను పంపించి తాను పురిటిగదికి అవతల పచారు చేస్తూండిపోయాడు రాజు. ఆ అమ్మాయి కష్టపడుతూనే ఉంది.

రాత్రి సుమారు పన్నెండు గంటల వేళ అయివుంటుంది. పురిటిగదిలో 'కేరు కేరు'న ఏడ్పు వినిపించింది రాజుకు.

రాజు హృదయం తేలికపడింది. ఏదో ఘనమైన కార్యాన్ని సాధించినట్టు భావించుకున్నాడు రాజు. బండివాడిని పురమాయించి. పొడిగా ఉన్న కట్టెలతో ఒక మూలగా పెరటిలో చూరుక్రింద మూడురాళ్లు పెట్టించి, ఎదురింటి కంసాలి యింటినుండి నీళ్ళకాగు తెచ్చి నీళ్ళు మరగ పెట్టించాడు. చాకింటినుండొచ్చిన రెండు పొడి తువ్వాళ్ళు తీసి తలుపుమీద పడేశాడు.

ఒంటిగంట ప్రాంతంలో శాయమ్మ గారు నవ్వుకుంటూ వచ్చారు. ఆమె అనుమతితో పురిటిగదిలో కెళ్ళాడు రాజు. పురిటివాసన నింపుకున్న ఆగది అతని కేదో క్రొత్త అనుభూతి నందించింది. నులక మంచంమీద మెడవరకూ కప్పుకొని పడుకుందా అమ్మాయి. ఆమె ప్రక్కలో అప్పుడే కళ్ళు తెరిచిన పసిపిల్ల పడుకుంది.

రాజు గదిలోకి రావడం గమనించి ఆ అమ్మాయి, రాధ లేవబోయింది. (ఆ అమ్మాయిపేరు రాధని రాజుకు తెలియదు). రాజు 'లేవకమ్మా' అనివారించాడు పాపాయిని చూస్తూ. రాధ దుప్పటి సవిరించుకుంది మెడవరకూ. రాధ దుప్పటి కప్పు

కున్నప్పుడు దుప్పటిలో మరుగుపడ్డ రాధ అందం రాజును ముగ్ధుడిని చేసింది, మొగలి పూవువంటి ఆమె దేహచ్ఛాయ, కెంపు వర్ణము నింపుకున్నవా అనిపించే ఆమె ఎఱ్ఱనిబుగ్గలు, సూటైన, సన్నని, ఆమె అందమైన ముక్కు, నల్ల కళ్ళు, ఎఱ్ఱని పెదిమలు రాజును ఒక్క క్షణకాలం ఆశ్చర్యచకితుణ్ణి చేశాయి. అపురూప సౌందర్యవతి అయిన ఆమె, ఆ భయంకర రాత్రివేళ నిరాశ్రయురాలు కాక తన ఇంట సుఖముగా ఉన్నందుకు రాజు సంతోషించాడు.

రాధముఖంలోని పోలికలు పసిపిల్లలో చూస్తూ 'బంగారుబొమ్మలా ఉంది' అని అన్నాడు.

ఆమాటకు మంత్రసాని ముఖంలోతప్ప, తల్లికూతుళ్ళ ముఖాలలో సంతోషం కనిపించలేదు.

'ఏవమ్మా! ఆడపిల్ల పుట్టటం మీ కిష్టం లేదా?' అని అడిగాడు రాజు.

రాధతల్లి కొద్దిసేపాగి అంది—

"సంతోషం లేకేం నాయనా? తల్లీ పిల్ల ఏర్పడ్డారు. అంతేచాలు. ఇంక మా కేదీ అవుసరంలేదు నాయనా. నీవు వెళ్ళి పడుకో. నా కొక చాప యిస్తే ఈమూల పడుకుంటాను. తెల్లారే బండి కట్టించుకొని వెళ్ళిపోతాం," అని.

"అదేమిటి? పచ్చిపురిటాలిని తీసికొని వెళ్ళిపోతారా? రెండురోజు లాగండి, వెళ్ళవచ్చు," అని అన్నాడు రాజు.

నీల్లేదు నాయనా! మా మరిది మా కోసం ఎదురు చూస్తూంటాడు. వెళ్ళాలి. లేకపోతే ఏమయ్యామో నని కంగారు పడతాడు," అందామె నిశ్చయంగా.

"సరే, మీయిష్టం," అని చెప్పి ఆమెకు చాప ఇచ్చి తాను వాలుకుర్చీలో నడుము వాల్చాడు రాజు.

పడుకున్న రాజుకు వెంటనే నిద్ర పట్టేసింది.

తెల్లవారువేళ రాధ తల్లి పిలుపుతో రాజుకు మెలకువ వచ్చింది.

"బండి సిద్ధమైంది బాబూ! వెడతాము," అందామె.

"ఇంత చీకటిలోనా?"

"అవును బాబూ! త్వరగా వెడితే అమ్మాయి విశ్రాంతి తీసికోవచ్చు."

"బండికూడా సిద్ధంకదూ!" అన్నాడు ఏమి అడగాలో తోచక.


"సిద్ధమే బాబూ! మీ వన్నీ గదిలోనే ఉంచాము. గది కడిగేశాను. మీరు ఒకసారి కడిగించేసి కాస్త ధూపం వేయించండి. బాబూ! మరి సెల విప్పించండి. మీ దయ వల్ల తల్లీపిల్ల ఏర్పడ్డారు. మీలాంటి మంచివారుండబట్టే ఈ భూమి ఉండగలుగుతోంది బాబూ! వెడతాం బాబూ!" అంటూ కన్నీరు నింపుకుందామె.

"వస్తాం. దయ ఉంచండి," అంది రాధ నమస్కరిస్తూ.

వెళ్ళి రామ్మ!" అన్నాడు రాజు. ఇంటిగడప దాటుతూ మరొక్కసారి నమస్కరించింది రాధ. ఆ సమయంలో ఆమె ముఖములో కనిపించే అమాయకత కళ్లలో నీలినీడలు, ఆమెలోని అమాయకమైన అందం రాజు మనసులో ప్రత్యేకాభిమానానికి తావు నిచ్చాయి.

బండి కదలబోయింది.

బండిలో మెత్తగా ఉండడానికి దుప్పటి తెచ్చి "పరుచుకోండమ్మా!" అన్నాడు రాజు.




వద్దులెం డన్నయ్యా!" అంది రాధ మెత్తగా.

ఆ మాటంటూ ముక్కు అందంగా విరిచింది రాధ. ఆనాటి ఆ ముక్కులోని అందం రాజు స్మృతిపథంలో మిగిలి పోయింది.

బండి కదిలింది. బండివెనుక కొద్ది దూరం వెళ్ళి తిరిగి వచ్చేశాడు రాజు.

ఆనాడు ఆ విధంగా కనిపించిన రాధ మరల మూర్తి యింట్లో మూర్తి భార్యగా కనిపించడం రాజుకు బాధే అనిపించింది నిజానకి.రాధ అతనికి మొట్ట మొదటిసారిగా కనిపించిననాటికి మూర్తి కింకా పెళ్ళి కాలేదు. మరి రాధ మూర్తి భార్య అవటం ఎలా సంభవం?

రాధను మరల కలియాలని ఏనాడూ కోరుకోలేదు. కాని ఏనాడైనా కలియటం తటస్థపడితే, తనయింట జన్మించిన 'పాప' గురించి అందరితో చెపుతూంటే విని గర్వ పడాలన్న కనీసపుకోరిక ఆతనిలో ఏదో మూల లేకపోలేదు. నిజానికి ఆతని కా కోరిక ఉండటంలో తప్పులేదు.

అనుకోకుండా రాధను కలిశాడు రాజు. కాని అతనికి కావలిసిన కలయిక అదికాదు; అక్కడ కాదు.

ఆలోచిస్తున్న రాజుకు ఎప్పుడో నిద్ర పట్టేసింది.

సాయంత్రం నాలుగుగంట లయిన తరువాత రాజును కారులో తీసికొని బయలుదేరాడు మూర్తి. చాలచోట్లు తిప్పి చివరికి 'బీచి'కి తీసికొచ్చాడు మూర్తి రాజును.

'రాధ మూర్తిభార్య ఎలా అయిం' దన్న సంశయం రాజును పీడిస్తూంటే అడగకండా అదే విషయాన్ని మూర్తి రాజుకు చెప్పసాగాడు యిసుకలో కూర్చుంటూ.

సుమారు 5 సంవత్సరాల క్రిందట

వ్యాపార నిమిత్తం మద్రాసు వెళ్ళి తిరిగి వస్తూంటే బెజవాడ స్టేషన్‌లో రాధ తల్లితో కనిపించిందట, రాధలోని అందం, అమాయకత ఆతని నాకర్షించినదట. అంత లోనే ఆమె తల్లి కలుగజేసికొని ఆతనితో పరిచయం సంపాదించుకొని రాధ వివాహం గురించి తాను బయలుదేరినట్లు చెప్పిందట. ఆతని ఎరికలో ఎవరినైనా చూడమందట. చివరకు ఆతనినే చేసికోమందిట. రాధ అందానికి ముగ్ధుడైన మూర్తికి ఆమె అలా అడగటంలో ఏ తప్పూ కనిపించలేదట. మరి నాలుగురోజులకే తిరుపతిలో ఆమెను పెండ్లి చేసికున్నాడట మూర్తి, రాధ తరఫున ఖర్చు తానే భరించి.

మూర్తిమాటల్లో రాధ పూర్వచరిత్ర అతనికి తెలిసినట్టు వినిపించలేదు రాజుకు. రాధ అందమైనది, అమాయకురాలు అవటమే కాదు శీలవతి, గుణవతి అని పొగిడాడు మూర్తి.

మూర్తి మాటల్లో రాధ యెడల మూర్తి చాలా తృప్తి ఉన్నట్టు కనుగొన్నాడు రాజు.

"రాధకు కోరకలు లేవు. రాధకు అందరికీ ఉన్నట్టు సరదాలూ లేవు. మొదటిలో చాల అన్యమనస్కంగా ఉండేది. ఎప్పుడూ దిగులుగా, నిర్లిప్తంగా కనిపించేది. ఒక్కొక్కప్పుడు రాత్రివేళ 'పాపా! పాపా!' అని కలవరించేది. పిల్లలు లేకపోవడమే దానికి కారణమని నేనూ బాధపడేవాడిని. సురేష్ పుట్టిన తరువాత రాధలో ఉత్సాహం, ఆనందం కనిపించసాగాయి. రాధకు నేనంటే ప్రాణం. రాధ నన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళదు. కనీసం తల్లిదగ్గిరకైనా వెళ్ళదు. ఆమె తల్లి మాత్రం ఒకసారి చూచి వెళ్ళింది. అంతే మరి రాలేదామె," రాధ గురించి తన కున్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు మూర్తి.

మూర్తి మాటల్లో వ్యక్తమైన 'పాప' గురించి ఏదో అడిగాలనుకున్నాడు రాజు. కాని అది మూర్తిని అడిగాల్సిన ప్రశ్న కాదు. దానికి సమాధానం రాధకే తెలియాలి.

మూర్తి మాటలు వింటూ 'ఊ' కొడుతూ ఉండిపోయాడు రాజు. బజారు నుండి తిరిగివస్తూ అనుకున్నాడు రాజు: "నన్ను చూస్తే రాధకు పెద్దపులి కనిపిస్తోంది. నాకు, ఆమె గురించి తెలిసిన నిజం మూర్తికి చెప్పి ఆమె జీవితాన్ని నాశనము చేస్తానేమో అన్న భయం ఆమెలో చాల ఉంది. నే నీ ఇంటికి రావటం ఆమెకు సుతారము యిష్టము లేదు. అందుచేత ఆమెలో ప్రశాంతత, చచ్చిపోకముందే మూర్తినుండి నిష్క్రమించటం శ్రేయం" అని.


ఆ విషయాన్ని రాత్రి మూర్తికి తెలియజెప్పా లనుకున్నాడు రాజు.

రాత్రి భోజనా లవుతున్నాయి. వంటలక్క లేని కారణంగా రాధే భోజనం ఏర్పాటు చేస్తోంది.

భోజనం చేస్తూ రాధకు వినిపించేలాగ చెప్పాడు రాజు మూర్తితో. "రేపుదయము ఎనిమిదిగంటల ట్రైనుకి వెళ్ళిపోతాను."

ఉలికిపడి చూచాడు మూర్తి ఆమాటలు విని.

"అదేమిటిరా! వచ్చింది ఈ రోజేగా!



అప్పుడే వెళ్ళిపోతా నంటా వేం? నీతో ఊరంతా తిరగాలి; నీ కెన్నో చూపించాలి అని నే ననుకుంటూంటే అప్పుడే వెళ్ళిపోతా నంటావేం?''

'నీ వన్నది నిజమే! కాని నే నిక్కడి కొచ్చింది ఒక రోజు ఉండటానికే. నిన్నూ, చెల్లాయిని చూచాను చాలు. మిమ్మల్ని తప్ప చూడటానికి నా కిం కేమీ లేదు. ఏవమ్మా చెల్లాయి! అంతే కదూ!''

రాజు తీసికున్న చొరవకి రాధకు మాట రాలేదు. కాని మాటాడక తప్పలేదు రాధకు.

మీ రలా చెప్పుల్లో కాళ్ళు పెట్టుకొని రావటం ఏం బాగా లే దన్నయ్యా!'' అంది రాధ ధైర్యం చేసి.

''లేదమ్మా! వెళ్ళితీరాలి. ఎన్నాళ్లున్నా ఇక్కడ ఉండాలనే ఉంటుంది. ఎప్పుడైనా పదరోజులపాటు ఉండేలా వస్తాను,'' అన్నాడు రాజు ఆమె వెనుక నున్న గోడ వైపు చూస్తూ.

రాజు మనస్తత్వం తెలిసిన మూర్తి రాజును బలవంతం చేయలేదు. భోజనం ముగించిన పిదప వాకిట్లో కుర్చీలు వేయించి రాజును కూర్చోమని చెప్పి కారు డ్రైవరుతో మాటాడుతూ కారు షెడ్ వైపు వెళ్ళాడు మూర్తి. రాజు వంటింటివైపు చూచాడు. రాధ భోజనం చేయడానికి ఉపక్రమించబోతున్నది. పనికుర్రవాడు సురేష్‌ని వీధిలో ఆడిస్తున్నాడు.

రాజు వంటింటి గడపలో కెళ్ళి నిలబడ్డాడు. రాజును చూచి తొట్రుపాటుతో లేచి నిలబడింది రాధ.

''చెల్లెమ్మా! భయంలేదమ్మా! నీ జీవితాన్ని నాశనం చేసే ఉద్దేశ్యం నా కేమాత్రం లేదు. నీ రహస్యాల్ని ఎవరికీ

బహిర్గతం చేయను. కాని ఒక సందేహం. 'పాప' ఏది? ఎక్కడుంది?" అని అన్నాడు ఒక్కసారి రాజు.

రాజు మాటలు వింటూ గోడకు చేర గిలా పడిపోయింది రాధ. ఆమె కన్నీరు సుడులు తిరుగుతూ కనిపించాయి. ఎడమ చెయ్యి చెంప కాన్చి దుఃఖం ఆపుకో ప్రయత్నించసాగింది. కానీ కన్నీరు ఆగే ధోరణిలో లేదు. బుగ్గలపై కన్నీరు వెల్లువలై ప్రవహించసాగింది. అక్కడ ఎక్కువసేపు ఉండటం శ్రేయం కాదని వీధిలోకి వచ్చేశాడు రాజు. వాకిట్లోకి వచ్చేసరికి మూర్తి డ్రైవరు కేదో చెప్పి పంపించివేశాడు. రాజును చూచి, "నీవు రేపు ఉండ నంటున్నావు. ఊరంతా చూడకపోయినా కనీసము ఇద్దరం కలిసి సినీమాకైనా వెడదాము. వస్తావా?" అన్నాడు మూర్తి.

"దాని కేం. తప్పకుండ వెడదాం," అన్నాడు.

"అయితే ఆగు. రాధను కూడ తయారవమని చెపుతాను. ముందు నీవు బట్టలు మార్చుకో," అంటూ ఇంట్లో కెళ్ళాడు మూర్తి. రాజు బట్టలు మార్చుకునేసరికి మేడ మీదికి మూర్తి వచ్చాడు.

"రాధ మనసు బాగోలేదట. భోజనం కూడా సరిగా చేయలేదు. రానంటున్నది. సాయంత్రం బీచికి రమ్మన్నా మనసు బాగోలేదని ఉండిపోయింది. అది ఎప్పుడూ అంతే. సరే దాని కేంలే! మనం వెళ్ళి వద్దాం పద," అన్నాడు మూర్తి.

రెండో ఆట సినీమా చూచుకొని వచ్చేసరికి ఒంటిగంట దాటిపోయింది గుడ్ నైట్ చెప్పుకొని నిద్ర కుపక్రమించారిరువురూ.

మర్నాడు ఉదయం ట్రైనుకు బయలుదేరుతూంటే రాధ ఒకపళ్ళెంలో చీర, రవికలగుడ్డపెట్టి పసుపు కుంకుమ పొట్లాలు కట్టి "మా మరదలుపిల్లకివ్వండి," అంది.

"మా చెల్లాయి చాల గడుసుదే. మా యింటికి రాకుండ సాగించుకుంటోంది," అని అన్నాడు మూర్తి.


అంతా నవ్వారు.

కారు ఎక్కుతూ వెళ్ళివస్తా నన్నట్లు చూచాడు రాజు రాధవైపు. రాధ ముఖంలో ఆందోళన ఒక ప్రక్క తెరలుగా కనపడుతున్నా, ఆమె కళ్ళలో అంతక్రితం రోజులా భయం లేదు. ఆ మార్పుకు నవ్వుకుంటూ ఆమెనుండి సెలవు తీసుకున్నాడు రాజు. మూర్తి స్టేషన్‌వరకూ వచ్చి రాజును ట్రైన్ ఎక్కించాడు. కొద్ది సేపటిలో ట్రైను కదలటం, మూర్తినుండి రాజు దూరం చేత వేరుచేయబడటం జరిగింది. తన సీటులో కూర్చుని డైరీ కోసం బ్యాగు తీసాడు రాజు. ఆ డైరీతోపాటు లెటర్ పాడ్‌లోని కాగితాలు కనిపించాయి. ఆ కాగితా లేమిటో అని తీశాడు. ఆ కాగితాలలో ఏదో ఉత్తరం వ్రాసిఉండటం, అది తనకే ఉద్దేశింపబడిఉండటం చూచి చదవటం ప్రారంభించాడు రాజు.

రాజన్నయ్య గారికి,

ప్రణామాలతో, చెల్లాయి రాధ వ్రాసుకుంటున్న ఈ ఉత్తరాన్ని చదివి మన్నించగలరనే విశ్వాసంతో నా చరిత్ర మీ ముందుంచుతున్నాను.

ఈ ఉత్తరం వ్రాయటం నాకు తప్పనిసరి. కాని ఉత్తరాన్ని ఎలా ప్రారంభించటమో, ప్రారంభించి ఎలా వ్రాయటమో నాకు తెలియదు. అందుచేత నా మనసున




ఉన్నదంతా వ్రాసేస్తున్నాను. జాగ్రత్తగ చదివి అర్థం చేసుకోగలరు.


వర్షంలో, మీ యింటికి బండిలో వచ్చిన నాటికి నేను అవివాహితను. అప్పటికి మూర్తిగారితో యింకా నాకు పెండ్లి కాలేదు. బహుశా ఆ సత్యం మీరు నన్ను యిక్కడ చూచిన తరువాత గమనించే ఉంటారు. మీ యింటికి నే నొచ్చిన వరకూ జరిగిన జీవితచరిత్ర మీకు తెలియదు, మిమ్మల్ని నేను మోసం చేశాను.

నే నొక పేదకుటుంబంలో పుట్టాను. పుట్టటంతోనే నా తల్లిదండ్రుల పోగొట్టుకున్నాను. మా అక్కే నన్ను పెంచుతూ వచ్చింది. మా బ్రతుకుతెరువుకు ఆధార మేదీ లేకపోగా పన్నెండవ ఏట నాటక సమాజంలో ఉద్యోగం సంపాదించుకున్నాను. మా అక్కకున్న చిన్న ఉద్యోగంతో జీవితయాత్ర ఒక మాదిరిగా సాగిపోసాగింది. యౌవ్వనపు తొలి రోజుల్లో సురేష్ అనే యువకునితో పరిచయమైంది. ఆనాటికి నాకు పదహారు సంవత్సరాలు. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆ ప్రేమలో తీయదనం ఎంతుందో గాని మా స్నేహాన్ని గురించి మా అక్క చేసిన హెచ్చరికలు చాల చేదనిపించాయి. ఒక రోజు రాత్రి మా అక్కయ్యతో చెప్పకుండ అతనితో పట్నం వెళ్ళిపోయాను. అతని దగ్గరున్న డబ్బుతో నా దగ్గరుండే రెండు మూడు వస్తువుల నమ్ముకొని, కొద్దికాలం కాలక్షేపం చేశాము. సురేష్‌కు అనుకున్నట్లుగా ఉద్యోగం దొరకలేదు. ఉన్నదంతా ఖర్చయిపోయింది. ఉన్నది పొదుపుగా వాడుకుంటూ బ్రతుకుతున్న రోజుల్లో సురేష్ టైఫాయిడ్ పడి, నన్నూ, ఈ లోకాన్నీ వదలి వెళ్ళిపోయాడు. ఆనాటికి మిగిలింది నేనూ, నా పద్దెనిమిదేళ్ళ యౌవ్వనం, నా పొరబాటుకు తప్పి

దంగా చిహ్నమూను. అక్కకు నా ముఖం చూపించదలచుకోలేదు. 'కృష్ణలో' ప్రాణాలను తీసికోవటం తప్ప నాకు వేరే మార్గం కనిపించలేదు. చావాలనుకున్న నన్ను విని చావనీయలేదు. మీ యింటికి నాతో వచ్చినామె నన్ను ఆదుకున్నది. భవిష్యత్తుపై ఆశ కలిగించింది. నన్ను ఆదరించి నెలలు నిండగానే నా కాన్పుకు ఏర్పాట్లు చేసి, అటు తరువాత ఎవరికీ తెలియని చోట ఎవరికో యిచ్చి వివాహం చేయ నిశ్చయించిందామె. జీవితం మీద తీపికొద్దీ ఆమె మాటకు కట్టుబడిపోయాను మీ యింటికి వచ్చేరోజు మధ్యాహ్నం, మీ ఊరికి సమీపంలో ఉండే తన బంధువు లింటికి నన్ను తీసికొని వెళ్ళిం దామె. కాని మా అదృష్టమో మో గాని వా రెవరూ లే రా ఊరిలో. గత్యంతరం లేక మీ ఊరి మీదిగా వచ్చేస్తున్నాము. కాని బండిలో ఉండటం నాకు దుర్భరంగా ఉన్నది. మీ యింటిలో ఆశ్రయం కోరాము. మిగతాది మీకు తెలుసు. ఉదయం మీ యింటినుండి బయలుదేరే వేళకి 'పాపాయి' ఒక సమస్య అయిందు మాకు. పాపను విడిచిపెట్టటం నాకు సుతారాము యిష్టం లేకపోయింది. కాని భవిష్యత్తుమీది ఆశకొద్దీ ఆ పని చేయక తప్పలేదు. పిన్నిగారి బలవంతం మీద 'పాపాయి'ని వదులుకోవలసి వచ్చింది నాకు.

ఏ తల్లీ చేయని సాహసం చేశాను. ఏ తల్లీ సహించని తప్పిదం చేశాను. బ్రతుకు మీది ఆశకొద్దీ జీవితంమీది తీపికొద్దీ, నా పద్ధెనిమిదేళ్ళ యౌవ్వనాన్ని 'పాప'కోసం త్యాగం చేయలేకపోయాను. పాపను విడిచిపెట్టక తప్పలేదు. పాప ఉంటే నాకు పెళ్ళి కాదన్న సత్యం తెలిసి కళ్లు తెరువని పసికందును నా నుండి దూరం చేసు కున్నాను.

మీ ఊరికి సమీపంలో ఒక దేవాల యము ఉంది. అది ఏ దేవాలయమో నాకు తెలియదు. మా బండి ఆసమీపానికొచ్చేసరికి కొద్ది కొద్దిగ తెల్లవారుతోంది. అదే సమయంలో ఒక ధనికుడు దేవాలయం లోకి వెళ్ళటం చూచాను. నా పాప నా నుండి దూరమైనా, ధనికుని యింట ఉండాలి. ధనికుని యింట పెరగాలి—అనే ఆశతో దేవాలయపు అరుగుపై పొత్తిళ్లలో నున్న పాపాయి నుంచి, పాపాయి ప్రక్కనే పిన్నిగారిచ్చిన ఇరవై రూపాయ లుంచాను; ఆ డబ్బుకైనా ఆశపడి పాపను ఆదరిస్తారన్న ఆశతో. పాపను వదలి బండి దూరమైనకొద్దీ నాలో దుఃఖం పొంగిపొర్లింది. నేను పాపం చేస్తున్నట్టు నా అంతరాత్మ గోల చేసింది. నాలో ఉన్న మాతృప్రేమ పెల్లుబికింది. పాపను దూరం చేసుకోవడం చాల పాప మనిపించింది. పాపకు అన్యాయం చేయ కూడదనిపించింది. పాపను తిరిగి తెచ్చు కొని హృదయానికి హత్తుకోవా లని పించింది. పాపకోసం ఏమైనా చేయా లని పించింది. పాపను తిరిగి తెచ్చుకోడానికి, బండి వెనక్కి త్రిప్పమన్నాను, ప్రాధేయ పడ్డాను. పిన్నిగారు నాపై ఆగ్రహిం చారు. ఆగని బండినుండి పాపను తెచ్చు కునేందుకు క్రిందికి దుమికాను. దూక టంలో సీరసం వల్ల పడపోయాను. తరువాత హాస్పిటల్లోనే తెలివి వచ్చింది. నాలుగు రోజులు అక్కడున్న తరువాత




నన్ను తీసికొని బెజవాడ చేరారు. అక్కడ నాఅదృష్టవశాత్తు 'ఆయన్ని' కలియటం, ఆయన నా పూర్వ చరిత్ర అడుగకుండ వివాహం చేసుకోవటం జరిగాయి,

వివాహం అయిందన్నమాటే గాని అందువల్ల తృప్తిగాని, శాంతిగాని లేకపోయాయి. పాపకు నేను చేసిన అన్యాయం నన్ను బాధిస్తునే ఉంది. పాపగురించి నాలో ప్రతి అణువు బాధపడుతునే ఉంది. కాని పాపను గురించి ఎవర్ని అడగను? ఎవరు చెపుతారు నాకు పాపగురించి? నిజానికి మీరు తప్ప పాపగురించి ఎవరూ చెప్పలేరు. పాపను నేను కన్నానేగాని పాప ఎలా ఉంటుందో నాకు గుర్తేలేదు. చంటిపాపలంతా ఒకలాగే ఉంటారు నాకు. నా 'పాప' ఎక్కడుందో, ఏం చేస్తోందో తెలిసికోవాలని ఉంది నాకు.

ఆయనతో నా వివాహం జరిగిన తరువాత మిమ్మల్ని ఫోటోలో చూచాను. ఆయన మీగురించి చెప్పినప్పుడల్లా, బాధ, దుఃఖం తప్ప నాకేమీ ఉండేవికావు. మీరు వస్తున్నారని తెలిసింది. పాపగురించి తెలుస్తుందని ఆశ కలిగింది. కాని నా రహస్యాన్ని బహిర్గతం చేసి నా జీవితాన్ని నాశనం చేస్తారేమో అన్నభయమే నన్ను ఎక్కువగా పీడించింది. మీరు రాకూడదని దేవుణ్ని కోరుకున్నాను. కాని మీరు వచ్చారు. నేనూహించినట్టు నా జీవితాన్ని నాశనం చేసే దృష్టి మీకు లేదని తెలిసింది. మీ హామీ కొండంతబలం ఇచ్చింది. అందుకే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

పాప నా రక్తంలో ఒకభాగం. అందుకనే నా భర్తకు తెలియనిదీ, తెలియకూడనిదీ, మిమ్మల్ని, 'చెల్లాయి' అని ప్రేమతో

పిలిచిన మిమ్మల్ని – నమ్ముకొని వ్రాస్తున్నాను. బహుశా ఇలాంటి సాహసం ఇంతవరకూ ఎవరూ చేసి ఉండరేమో, చేయ రేమో. కాని చేయకూడదన్న నియమం లేదన్న సత్యం నాకు తెలుసు. నాకు పాప కావాలి. నేను పాపను చూడాలి. నా పాపను నాకు వప్పగించ గలిగితే అంతకన్నా నాకు కావలసిందేదీ లేదు. పాప క్షేమసమాచారాలు ఉత్తరంపై చిరునామాకు వ్రాస్తే నాకు అందుతుంది.

కన్నీళ్ళతో,

చెల్లాయి,

రాధ.

రాజు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అమాయకమైన రాధ ముఖం కన్నీళ్ళతో రాజుముందు నిలిచినట్లయింది. 'పాపను' వదలుకోవడంలో రాధ తప్పునే చేయ వచ్చు. కాని ఆ పరిస్థితిలో అంతకన్నా గత్యంతరం లేదనిపించింది రాజుకు నిట్టూర్చుతూ ఉత్తరం మడిచాడు రాజు. "పాప, రాధ అమితంగా ప్రేమిస్తున్న పాప, ఎక్కడుంది? ఏంచేస్తోంది?" అంటూ ఆలోచనలో పడ్డాడు రాజు.

"అమ్మా! ధర్మం చేయండమ్మా!" అంటూ ఆరేళ్ళ అమ్మాయి ట్రైనులో ముష్టి అడుగుకుంటూ ప్రవేశించింది.

రాజు మెదడులో ఏదో విశాలమయినట్టు, ఏదో ఆధారం దొరికినట్టు అనిపించింది అతనికి. మెదడులో సుస్థిరమై నిర్మింపబడిత జ్ఞాపకాలు ఒక్కసారి వెలుగులోకొచ్చాయి. తన 'సీటు'పై చేరగిలాపడుతూ. మెదడులో తిరిగే జ్ఞాపకాల సముదాయాలను, వర్తమానానికి ముడిపెడుతూ, అది ఎంత వరకూ సమంజసమో అన్న తర్కంలో పడిపోయాడు రాజు.

అయిదేళ్ళక్రితం –

అదేరోజు వర్షంపడి వెలిసినరోజు మర్నాడు —

రాధ తనయింట ఆశ్రయం పొంది, బయలుదేరిన మర్నాటి ఉదయకాలం – ఎనిమిది తొమ్మిది గంటలైనప్పుడు – పోస్టల్ బాగ్సు తేవాలని సైకిలుమీద రోడ్డుకు వెడుతూ చూచా డొక గుంపు అదే దేవాలయంముందు. ఆ గుంపెక్కడ ఎందుకు ఉందో తెలిసికోడానికి వ్యవధిలేక ముందుకు సాగిపోయాడు.

తిరిగి వస్తున్నప్పుడు ఎవరో అనగా విన్నాడు రాజు.

'ఎవరో కనులు తెరువని పసికందును, దేవాలయం అరుగుమీద వదలివేశారట' అని. ఆ విషయం తెలియగానే తనయింట ప్రసవించిన 'ఆమె' పాప కాదుకదా అన్న సంశయం కలుగకపోలేదు. కాని 'ఆమె'ను గాని, ఆమెతోవచ్చిన స్త్రీనిగాని అనుమానించలేకపోయాడు. వారిమీద నున్న బలమైన విశ్వాసమును, ఒకచిన్న అనుమానానికి బలిచేయడం యిష్టం లేకపోయింది రాజుకు – 'ఆ అమ్మాయి' చాల సంస్కారమున్న పిల్ల. ఆమె అలాంటిపని చేయదు. అయినా ఆమెకు ఆ పనిచేసే అవసరం ఏమిటి ? భర్త ఎదుట – పసిపిల్లను పొత్తిళ్ళలో నుంచుకొని పసిపిల్ల కిలకిలలో పాలు పంచుకోవటం ఏతల్లి కోరుకోదు. ఆ పసిపిల్ల ఆమె కూతురు అవదు. అవకూడదు – అనే నిర్ణయాన్ని తీసికొని ఊరటపడ్డాడు రాజు.

ఎవరో (?) విడిచిపెట్టిన పాపను చాల




మంది గుంపుగ కూడి చూచారట. కాని ఎవరికీ ఇంటికి తీసికొనిపోయి. పెంచుకునే పాటి సామర్థ్యంగాని. సహృదయత (?) గాని లేకపోయాయిట. ముఖంమీద ఎండ పడి 'పాప' కేరుకేరు మని ఏడుస్తోందట. ఏ ధనవంతుడూ (రాధ ఊహించినట్లు) పాపను పెంచుకోడానికి ముందుకు రాలేదట. అదేసమయంలో 'ఆదెమ్మ' అనే కాపుస్త్రీ హృదయము ద్రవించిందట. ఆమెకు పిల్లలు పుట్టి మిగలక పోవటంచేత పాపను హృదయానికి హత్తుకొని, పాపతో పాటు ఉన్న ఇరవై రూపాయలు తీసికొని తనింటికి వెళ్ళిపోయిందట – అని ఆరోజు సాయంత్రం పొలం గట్టుమీద ఎవరో చెప్పగా విన్నాడు.

రాజు ఆవూరిలో మూడేళ్ళున్నాడు. ఆ మూడేళ్ళలో ఆదెమ్మ గురించిగాని, ఆమెసాకుతున్న పాప గురించిగాని పట్టించుకోకపోయినా ఊరిలో జరిగే విషయాలు చెవిని పడక మానవు కనుక కొన్ని విషయాలు విన్నాడు రాజు. ఆదెమ్మ 'పాప'ను మూడేళ్ళు జాగ్రత్తగా పెంచింది. చాల అపురూపంగా పెంచింది. అలా పెరిగే అదృష్టం పాపకు లేకపోయింది. మూడు రోజులు జ్వరంపడి, నాల్గవరోజున శాశ్వతంగా నిద్రపోయింది ఆదెమ్మ. 'పాప' తల్లి లేనిదైంది. ఆదెమ్మ భర్త. సూరన్న కుంటివాడు. అయినా ఏదో విధంగా పాపకై తాపత్రయ పడ్డాడు. అదీ ఎంతో కాలం సాగలేదు. అదేసమయంలో రాజు పట్నంలో క్రొత్త ఉద్యోగం సంపాదించుకున్నాడు.

ఒకరోజున రాజు బస్సుస్టాండుకు పనుండి వెళ్ళగా, ఒకచోట ఒక గుంపు చేరి

ఉండటం చూచి, బస్సు బయలుదేరటానికి వ్యవధి ఉండటంచేత గుంపుదగ్గర చేరాడు.

గుంపుకు ఒకప్రక్క కుంటిసూరన్న కూర్చుని రెండు చెక్కముక్కలతో తాళం వేస్తున్నాడు. గుంపు మధ్య పాప నిలబడి పాట పాడుతోంది ఆమె ముందొక మాసి పోయిన గుడ్డ పరిచిఉంది. అందులో కొన్ని డబ్బు లున్నాయి.

'తు మీ హో మాతా!
పితా తు మీ హో
తు మీ హో బంధు
సిఖా తుమీ హో !'—

అనే పాటను తీయగ ముద్దుగ పాడు తోంది పాప. పాప పాటలో మైమరచి అంతా వింటున్నారు. రాజు పాపను చూచి ఎందుకో గిలగిలలాడిపోయాడు.

అదే పాట పాడుకుంటూ అయిదేళ్ళ పాప సూరన్ననూ తన్నూ పోషించు కుంటూ జీవితం గడపటం చాలాసార్లు చూచాడు రాజు బస్సుస్టాండు దగ్గర,

రాధ దేవాలయం దగ్గర విడచిపెట్టిన పాప, ఆదెమ్మచేత పోషింపబడి, సూరన్నను పోషించే పాపకన్న ఎవరవుతారు?

రాధ అందాన్ని అణువణువునా దిద్దు కొని, ఆమె సౌందర్యాన్ని ప్రతిఅంగంలో నింపుకున్న 'పాప' రాధ కూతురుకాక ఇంకెవ రౌతారు ?

రాధ కళ్ళలోని తేనియవర్ణం; ఆమె బుగ్గలలో కెంపుచ్ఛాయను, ఆమె శరీర ములో మొగలిపూ ఛాయలను: పెదిమ లలో ఎఱ్ఱదనాలను వారసత్వపు హక్కుగా పొందిన 'పాప' రాధకూతురుకాక వే రెవ రౌతారు.

రాధ బండిలో వెళ్ళిపోతూ వదలిన ముక్కు అందం పాపకూ ఉండటంలో ఆశ్చర్య మేముంది ?

రాధ అభిమానిస్తున్న పాప కుంటి సూరన్నతో ఉన్న పాపతప్ప వేరుకాదు.

కానీ, ఈవిషయాన్నైనా రాజు రాధకు తెలుపవలసినది? ఈ వివరాలనేనా రాధ ఆశించింది? సంస్కార హీనమైన జుట్టుతో, మురికి గుడ్డలతో, మట్టిలో పొర్లాడుతూ, నేలపై నిద్రిస్తూ, ఎంగిలాకుల్లో భోజనం చేస్తూ పాప జీవిస్తున్నదన్న వివియమేనా రాజునుండి రాధ ఆశించింది? అదే విష యాల్నా రాజు రాధకు వ్రాయవలసింది; 'అని మీరంతా బాధపడవచ్చు. కాని మీరు బాధపడనవసరంలేదు.

రైలుదిగి సరాసరి బస్సుస్టాండుకు పోయి చూచాడు రాజు పాపకోసం; అది గాదు రాజు పాపకోసం; విన్నాడు రాజు పాపగురించి.

పాప గురించి ఎవరూ బాధపడ నక్కర లేదు. పాపగురించి రాజుగాని, రాధగాని, కుంటిసూరన్న గాని బాధపడ నక్కర లేదు. విచారించ నక్కరలేదు.

పాప తీయని కంఠం వినే అదృష్టం కొంతమందికి లేకపోవచ్చు. అయినా పాప అదృష్టవంతురాలు.

పాప చాల అదృష్టవంతురాలు.

ఇక ముందు పాప వీధుల్లో మురికిలో జీవించ నక్కరలేదు.

చలికి వణక నక్కర లేదు.

ఆకలితో అలమటించ నక్కరలేదు.

ఎండబాధను వరించనవసరం లేదు.

పాపకు బాధలు లేవు.

దేవుడు పాపను అనుగ్రహించాడు.

పాప ఆదెమ్మను అనుసరించింది.

——